మొక్కల పెంపకంతో ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు

కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ, మున్సిపల్ పరిధిలోని కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకంతో మానసిక, శారీరక ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులను, సూర్యుడి నుంచి వెలువడే రేడియేషన్ తగ్గించి క్యాన్సర్ వంటి వ్యాధులను అడ్డుకోవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిశుభ్రతను పాటిస్తూ.. మొక్కలను నాటి వారి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో నూతనంగా నిర్మించిన పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బాధ్యతగా పనిచేయకుంటే ఎలా?

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సమాచారం మీకు తెలియదా

వైద్యాధికారులపై కలెక్టర్ అసహనం

చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): 'బాధ్యతగా పనిచేయకుంటే ఎలా? లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సమాచారం మీకు తెలియదా?' అని వైద్యాధికారులపై కలెక్టర్ సుమిత్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో పీసీపీఎన్ డీటీ యాక్ట్ 1994 డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా జడ్జి రమేష్‌తోపాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు జిల్లాకు సరిహద్దులో ఉండటంతో జిల్లా కేంద్రంలో చాలాకాలంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. ఆశా, ఏఎన్ఎంలు స్థానికంగా ఉన్నప్పటికీ మొదటి, రెండుసార్లు ఆడబిడ్డలు పుట్టినప్పుడు మూడోసారి ఆ మహిళ గర్భం దాల్చిన విషయాన్ని ఎందుకు తెలుసుకోలేక పోతున్నారో చెప్పాలన్నారు. పదేళ్లలో సీడీపీవోలు, మెడికల్ ఆఫీసర్లతో కలిసి ఒక్కసారైనా సమావేశాలు పెట్టారా అని నిలదీశారు. అబార్షన్లతో ఆడబిడ్డల నిష్పత్తి పూర్తిగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యిమంది పురుషులకు 947 మంది స్త్రీలు ఉన్నారని, ఈ నిష్పత్తిని ఇతర జిల్లాలో పోల్చితే చాలా తక్కువగా ఉందన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేస్తే లింగనిర్ధారణ పరీక్షలను అడ్డుకోవచ్చన్నారు. పలమనేరు, నగరి, పుంగనూరు. వి.కోట మండలాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అనుమతి లేకుండా జరుగుతున్న అబార్షన్ల శాతం మిగిలిన మండలాలతో పోల్చితే ఎక్కువగా ఉందన్నారు. డివిజన్లవారీగా ఆర్ఎంపీ డాక్టర్లతో సమావేశాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. స్కానింగ్ యంత్రాలను అనధికారికంగా అమ్ముతున్న వారిపైనా నిఘా ఉంచాలని పోలీస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో సుధారాణి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఐవో హనుమంతరావు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

టైరు పేలడంతో పల్టీలు కొట్టిన కారు

చిత్తూరు కమిషనర్‌కు స్వల్పగాయాలు

పాకాల/చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): కారు టైరు పేలడంతో అదుపుతప్పి రోడ్డుపైనున్న డివైడర్ ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం విధులు ముగించుకున్న కమిషనర్ తిరుపతికి ఇన్నోవా కారులో బయల్దేరారు. ఆయనతోపాటు సీసీ అమరనాథరెడ్డి కూడా ఉన్నారు. చిత్తూరు-తిరుపతి మార్గమధ్యంలో పాకాల మండలంలోని గాదంకి టోల్ గేట్ సమీపంలో వేగంగా వెళుతున్న వీరి కారు టైరు పగిలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని మూడు పల్టీలు కొట్టింది. ఎడమవైపు రోడ్డులో వెళ్తున్న వాహనం కుడివైపు త్రీలైన్ రోడ్డుపై బోల్తా పడింది.ఈ ప్రమాదంలో వాహనంలోని నరసింహ ప్రసాద్,అమరనాథరెడ్డిలతో పాటు డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌కు గాయాలయ్యాయి.



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కమిషనర్ కారు

పూతలపట్టు ఎమ్మెల్యే పీఏ భాను ఆ దారిలో వెళుతూ ఈ ప్రమాదాన్ని గమనించి పోలీసులకు సమాచారమందించాడు.పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన వారిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో ఈనెల 12వ తేదీన ప్రారంభమైన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజున ఫస్టియర్, సెకండియర్ పరీక్షలకు 625 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో శ్రీనివాసులు తెలిపారు. ఫస్టియర్ జనరల్‌లో 5,097 మందికి 4,814 మంది, ఒకేషనల్‌లో 503 మందికి 274 మంది హాజరయ్యారు. సెకండియర్ జనరల్‌లో 1,319 మందికి 1,234 మంది, ఒకేషనల్‌లో 148 మందికి 117 మంది పరీక్షలు రాశారు. పాలసముద్రం, నగరి, పుత్తూరు, వడమాలపేటలోని పలు జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు పరిశీలించినట్లు డీఐఈవో తెలిపారు. జిల్లా ప్రత్యేక అధికారి దయానందరాజు, కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, శరశ్చంద్రశేఖర్‌లు 10 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 18 కేంద్రాలు పరిశీలించారు.

ఒక్కో పోస్టుకు 34మంది పోటీ

డీఎస్సీకి అందిన దరఖాస్తులు 45,221

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1324 పోస్టులకు 26,501మంది అభ్యర్థుల పోటీ

చిత్తూరు సెంట్రల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి పోటీ ఎక్కువగానే వుంది.గత నెల 20వ తేదీన మొదలైన డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 15వ తేదికి ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1324 పోస్టులకు 45,221దరఖాస్తులు అందాయి.వచ్చిన దరఖాస్తుల్లో పురుషుల కంటే అధికంగా 6195మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. జిల్లాలోని 1478 పోస్టులను రెండు విభాగాలుగా చేస్తూ దరఖాస్తులు స్వీకరించారు.జనరల్ కేటగిరిలో 1324 పోస్టులు, దివ్యాంగుల కేటగిరిలో 149 పోస్టులు కేటాయించారు. జనరల్ క్యాటగిరిలో ఒక్కో అభ్యర్థి ఒక్క పోస్టుకు మించి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే 26,501మంది అభ్యర్థులు ఏకంగా 45,221 దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఒక్కో పోస్టుకు 34 మంది పోటీ పడనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 10,153మంది పురుషులు, 16,348 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. దివ్యాంగుల కేటగిరిలో మరో 149 పోస్టులకు గాను 2461 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో పోస్టుకు 16మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. డీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనుండగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రభుత్వ,జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు కేటగిరీలు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ, వ్యాయామ 1473 పోస్టులు భర్తీ చేయనుండగా, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలల్లో మరో ఐదు పోస్టులు(మ్యాథ్స్ 1, ఫిజిక్స్ 1, బయాలజీ 1, ఎస్జీటీ 2)తో మొత్తంగా 1478 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి.

● **మే 20 నుంచి మాక్ టెస్టు :** మెగా డీఎస్సీ ప్రక్రియలో భాగంగా తొలి దశ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిన వేళ, మే 20 నుంచి ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులో ఉంటుంది. మే 30 నుంచి ఆన్‌లైన్‌లో డీఎస్సీ అభ్యర్థులు పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి పరీక్ష అనంతరం రెండు రోజుల్లో 'కీ'ని విడుదల చేస్తారు. ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుదల చేస్తారు. ఆ తర్వాత ఏడు రోజులకు డీఎస్సీ మెరిట్ (మార్క్స్ మెమో)విడుదల చేయనున్నారు.

పోస్టు	జడ్పీ, ప్రభుత్వ, మున్సిపాలిటీ
ఎస్జీటీ	976
ఎస్ఏ తెలుగు	38
ఎస్ఏ హిందీ	17
ఎస్ఏ ఇంగ్లీష్	104
ఎస్ఏ మ్యాథ్స్	30
ఎస్ఏ ఫిజిక్స్	29
ఎస్ఏ బయాలజి	63
ఎస్ఏ సోషల్	130
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	86
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు	05
మొత్తం	1478

దివ్యాంగుల కేటగిరి

కేటగిరి	పోస్టులు	దరఖాస్తులు
ఈడబ్ల్యుఎస్	138	1664
పీహెచ్-విజువల్	1	134
పీహెచ్-హియర్	10	57
ఆర్థోపెడికల్	-	595
మెంటలీ ఇలనెస్	-	11
	149	2461

ఉమ్మడి చిత్తూరు జిల్లా
రోస్టర్ పోస్టులు, వచ్చిన దరఖాస్తులు

కేటగిరి	పోస్టులు	దరఖాస్తులు
ఓసీ	578	2856
బీసీ-ఏ	111	4000
బీసీ-బీ	139	3790
బీసీ-సీ	19	101
బీసీ-డీ	102	2570
బీసీ-ఈ	53	1661
ఎస్సీ-గ్రేడ్ 1	21	4
ఎస్సీ-గ్రేడ్ 2	94	1872
ఎస్సీ-గ్రేడ్ 3	112	7997
ఎస్టీ	95	1650
	1324	26,501

గంగమ్మ విశ్వరూప దర్శనానికి సీఎం

● 21న పట్టు వస్త్రాలు సమర్పించనున్న చంద్రబాబు





ద్రావిడ వర్సిటీ క్రీడాప్రాంగణంలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు - చంద్రబాబు ఇంటి వద్ద చేపడుతున్న చదును పనులు

కుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారు. ఈనెల 21వ తేదీన ఆయన కుప్పం వచ్చి అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. గంగమ్మ జాతర మహోత్సవాలు ఈనెల 14న వినాయక ఉత్సవంతో ప్రారంభమై అంగరంగ వైభవంగా జరుగుతున్న విషయం తెలిసిందే.టీడీపీ నాయకుల కోరిక మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 21వ తేదీన కుప్పం వచ్చి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఆ పార్టీ వర్గాలు చెప్పాయి. అధికారిక షెడ్యూల్ ఇంకా రాకపోయినా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు డీఎస్పీ పార్థసారథితో కలిసి పరిశీలించారు. ద్రావిడ విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ ప్రాంతంతోపాటు కుప్పం గంగమ్మ ఆలయంనుంచి యూనివర్శిటీ దాకా రాకపోకలు సాగించే మార్గాన్ని సైతం పరిశీలించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు వీజీప్రతాప్, సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇంటివద్ద ముమ్మర ఏర్పాట్లు

శాంతిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 25న గృహప్రవేశం చేయనుండడంతో శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ, శివపురం గ్రామ పరిధిలో నిర్మిస్తున్న ఇంటివద్ద ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో ఇంటి వద్ద పొక్లయిన్ల ద్వారా చదును చేసే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.గృహప్రవేశ కార్యక్రమానికి చంద్రబాబు కుటుంబ సభ్యులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానుండడంతో అందుకు తగ్గ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.వేలాదిమందికి అన్నదానం చేసేందుకు ఇంటి పక్కనే భూమిని చదును చేస్తున్నారు.తుమ్మిశి వద్ద హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

21న డీఈవో కార్యాలయం ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు

చిత్తూరు సెంట్రల్, మే 17 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ చేపట్టిన బడుల పునర్వ్యవస్థీకరణ, పోస్టుల హేతుబద్ధీకరణ, బదిలీలు, పదోన్నతులపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఈనెల 21వ తేదీన డీఈవో కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఈ క్రమంలో జిల్లాలో ఉద్యమం చేపట్టడానికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ జిల్లాలవారీగా ఉపాధ్యాయ సంఘాలకు బాధ్యతలు అప్పగించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి డీఈవో కార్యాలయాన్ని ముట్టడించే బాధ్యతలను ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌లకు అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీవో హోంలో ముట్టడిపై కార్యాచరణ ప్రణాళిను రూపొందించనున్నారు. ఈమేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

17 మండలాల్లో వర్షం



వర్షంతో పలమనేరు మండలంలో నేలవాలిన వరిపంట

చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 17 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది.బైరెడ్డిపల్లెలో అత్యధికంగా 67.2, పాలసముద్రంలో అత్యల్పంగా 2.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.పలమనేరులో 46.2మిమీ, పెద్దపంజాణిలో 38.6, గంగవరంలో 34.2, వి.కోటలో 33.2, రామకుప్పంలో 28.2, గుడుపల్లెలో 26.4, కుప్పంలో 24, పుంగనూరులో 20.2, శాంతిపురంలో 18.6, వెదురుకుప్పంలో 12.4, బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో 9.2, తవణంపల్లెలో 3.2, చిత్తూరులో 3, గుడిపాలలో 4.2 మిమీ వర్షం కురిసింది.

నీరసిస్తున్న ఓపెన్ విద్య..!?



డీఈవో కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ విభాగం

చిత్తూరు సెంట్రల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాలు నిరాశను మిగిల్చాయి. వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఓపెన్ స్కూల్ విధానంపై అధికారులు, సెంటర్ కో-ఆర్డినేటర్ల నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఫలితాలు వచ్చాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టెన్త్‌లో 864 మంది పరీక్షలు రాయగా, కేవలం 77మంది ఉత్తీర్ణులయారు. ఇంటర్‌లో 3008 మంది పరీక్షలు రాయగా, 603 మంది మాత్రమే ఉత్తీర్ణులయారు. దీంతో టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్ ఫలితాల్లో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 20వ స్థానంలో నిలిచింది.

సకాలంలో అందని పాఠ్యపుస్తకాలు : ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి ఏటా సార్వత్రిక విద్యాపీఠం సంస్థ నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. ఫీజు చెల్లించిన వారికి మెటీరియల్ అందజేస్తుంది. ఈ ఏడాది సకాలంలో పుస్తకాలు అందలేదని, ఆయా కోర్సులకు ఫీజులు చెల్లించిన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చిలో జరిగే పరీక్షలకు గత ఏడాది డిసెంబరులో మెటీరియల్ పంపిణీ చేశారు. దీంతో స్టడీ సెంటర్ల నిర్వాహకులు సకాలంలో సిలబస్ పూర్తి చేయలేదనే విమర్శలు ఉన్నాయి.

స్టడీ సెంటర్ల నిర్వాహకుల తీరుపై విమర్శలు : జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో పదో తరగతి స్టడీ సెంటర్లు 32, ఇంటర్మీడియట్ స్టడీ సెంటర్లు 71 ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు ఈ ఏడాది పర్యవేక్షణను పూర్తిగా గాలికి వదిలేశారనే ఆరోపణలున్నాయి. విద్యాపీఠం షెడ్యూల్ ప్రకారం తరగతులు నిర్వహించక పోయినా, అధికారులు పట్టించుకోలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పరీక్షల ఫీజులే కాకుండా తాము పాస్ చేయిస్తామని చెప్పి అభ్యర్థుల నుంచి స్టడీ సెంటర్ నిర్వాహకులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే వాదనలూ విన్పిస్తున్నాయి.తీరా పరీక్షల సమయంలో నిఘా పెరగడంతో తామేం చేయలేమంటూ చేతులెత్తేశారని అభ్యర్థులు మండిపడుతున్నారు. ఈనెల 19 నుంచి 24 వరకు టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడైనా తమను పాస్ చేస్తారనే ఆశలతో అభ్యర్థులు ఉన్నారు. టెన్త్‌లో ఫెయిలైన 787 మందిలో 670 మంది సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించారు.ఇంటర్‌లో ఫెయిలైన 2405 మందిలో 2,182 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. కాగా విద్యాశాఖ అధికారులు ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు ఎలా నిర్వహిస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

స్కేటింగ్‌పై ఆసక్తి. సాధన చేద్దామంటే ట్రాక్ లేదు. అయితేనేం పట్టుదలతో కసరత్తు చేసింది. రోడ్డే ట్రాక్‌గా చేసుకుంది. గాయాల పాలైనా వెనుకంజ వేయలేదు. ఇటీవల జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన కస్పరాజు స్నేహకృతి క్రీడా నేపథ్యమిది.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి





తిరుమలలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నటి హరితేజ, సీఎం చంద్రబాబు సోదరి హైమావతమ్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.56 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,970

తలనీలాలు సమర్పించినవారు: 33,871



శ్రుతిమించిన ఇసుకాసురుల ఆగడాలు

- పొర్లుకట్టను సైతం తొలిచేసిన వైనం
- ఆ మట్టితోనే నది గర్భంలోకి రోడ్డు ఏర్పాటు

పెళ్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా కప్పగుంట కండ్రిగ వద్ద పొర్లుకట్టను సైతం తవ్వేశారు. ఆ మట్టితోనే ఇసుక తరలింపు కోసం నది గర్భంలోకి ప్రత్యేక రోడ్డును నిర్మించారు. రోజూ రాత్రి ట్రాక్టర్లతో మేనకూరులోని ప్రైవేట్ కంపెనీలకు యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు. వాహనాల రాకపోకలతో స్వర్ణముఖి నది చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతున్నాయి.

● ఆందోళనలో రైతాంగం

స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తవ్వేస్తుండడంతో సాగు, తాగునీటికి కష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది వాహనాలతో ఇసుకను తరలించేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక మాఫియాను కట్టడి చేయాలి

జీలపాటూరు రెవెన్యూ పరిధిలోని స్వర్ణముఖినది సమీపంలో కప్పగుంటకండ్రిగ కాజ్‌వే నుంచి గత వైసీపీ హయాంలో భారీ యంత్రాలతో విచ్చలవిడిగా ఇసుక తోడేశారు. అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేసి ఇసుక తరలింపును అడ్డుకున్నాం. భూగర్భ జలాలను పెంచుతూ అదే ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మాంచాలని 2014 టీడీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు పంపాం. ఈ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మిస్తే అనేక గ్రామాల ప్రజలకు తాగు, సాగు నీరు అందుతుంది. కూటమి ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉంది. అయితే ఇసుక మాఫియా అరాచకాలతో స్వర్ణముఖికి గర్భశోకం తప్పేలాలేదు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- శివకుమార్, సర్పంచు, జీలపాటూరు



కప్పగుంటకండ్రిగ సమీపంలో పొర్లుకట్టను తొలిచిన అక్రమార్కులు - (ఇన్‌సెట్‌లో) నదిలో ఏర్పాటు చేసిన రోడ్డు

కాళ్లకు చక్రాలు కట్టుకుని...!

● జాతీయ స్థాయి స్కేటింగ్‌లో బంగారు పతక విజేత స్నేహ కృతి



సాధించిన పతకాలతో స్నేహకృతి

ఇంటిల్లిపాదీ క్రీడలు ఆడే కుటుంబం నుంచి వచ్చింది కస్పరాజు స్నేహ కృతి. ఇటీవల ఢిల్లీలో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్ల పోటీల్లో బంగారు పతకంతో మెరిసింది. తిరుపతి రూరల్ పేరూరు సమీపాన నివాసం. తల్లి ప్రొఫెసర్ అఖిల స్వతంత్ర ఎస్వీ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి. తండ్రి వంశీకృష్ణ న్యాయవాది. అక్క ఆశ్రిత తిరుపతి శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్‌కు వెళ్లేవారు. అక్కతో పాటు స్నేహకృతి కూడా వెళుతూ స్కేటింగ్ పట్ల మక్కువ పెంచుకుంది. తల్లికి షటిల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్‌లో ప్రావీణ్యముంది. తండ్రి వంశీకృష్ణ కబడ్డీలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. స్కేటింగ్ ట్రాక్ లేకున్నా రోజూ ప్రకాశం పార్క్‌కు వెళ్లి రెండు పూటలా ప్రాక్టీస్ చేసేది. ఒక్కోసారి ఐదు గంటల వరకూ ప్రాక్టీస్ చేసిన సందర్భాలున్నాయి. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి బాబ్జీ, కోచ్‌లు ప్రసాద్, శశి కిరణ్, పవన్ కల్యాణ్ వద్ద మెలకువలు నేర్చుకుంది. పదేళ్ల నిరంతర కఠోర సాధన ఫలితమే తాజాగా జాతీయ స్థాయిలో స్వర్ణ పతకమంటోంది స్నేహకృతి. కాకినాడ స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్లు, వెయ్యి మీటర్ల పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. 2019లో జాతీయ స్థాయిలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను పొందింది. స్నేహకృతి తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థల్లో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఇంటర్‌లో 470కి గాను 456 మార్కులు సాధించింది. పదవ తరగతిలో 600కు 587 మార్కులు పొందింది.



తల్లిదండ్రులతో స్నేహకృతి

ట్రాక్ ఏర్పాటు చేయాలి

తిరుపతిలో కనీసం 200 మీటర్లతో స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ఎందరో రాణిస్తారు. నేను రోడ్లపైనే ప్రాక్టీస్ చేస్తూ అనేక సార్లు గాయపడ్డాను. అనుకూల వాతావరణం కల్పిస్తే ఎక్కువ మంది ఎదుగుతారు. 2019లో జాతీయ స్థాయిలో రాణించిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతి ప్రకటించినా అందలేదు. జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్‌కు రూ.75 వేలు, రజిత పతకానికి రూ.50 వేలు ప్రకటించి ఇవ్వలేదు. ఇలాంటివి అందిస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది.

- స్నేహ కృతి

కవి గొల్లాపిన్ని కన్నుమూత



సుబ్రమణ్యశర్మ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17 (ఆంధ్రజ్యోతి): కవి గొల్లాపిన్ని సుబ్రమణ్యశర్మ (79) కన్నుమూశారు.చిత్తూరు జిల్లా సదుం ఈయన స్వగ్రామం.తిరుపతిలోని కొర్లగుంటలో నివాసముంటోన్న ఈయన శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి 2010లో రిటైరయ్యారు. కవితాసుమాలు, పువ్వులు నవ్వులు, బాలలతాత, పక్షులం, విజయానికి ముప్పై రహస్యాలు, కల్హాపూర్ మహాలక్ష్మి చరిత్ర వంటి పుస్తకాలు వెలువరించారు. తిరుపతిలో జరిగే కవి సమ్మేళనాల్లో స్వీయ కవితలను లయాత్మకంగా చదివేవారు. గొల్లాపిన్నికి భార్య ఉషాకిరణ్, కుమార్తె సౌజన్య (అమెరికా), తనయుడు కిషోర్‌కుమార్ (బెంగళూరు) లో ఉన్నారు.సుబ్రమణ్యశర్మ అంత్యక్రియలు సోమవారం ఉదయం 10 గంటలకు ఆయన అత్తగారి వూరైన అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలోని దొడ్డిపల్లె పంచాయతీ శివరామపురంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కవి గొల్లాపిన్ని మృతి పట్ల తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, సాహిత్యవేత్తలు ఆముదాల మురళి, శైలకుమార్, కృష్ణవేణి, యువశ్రీ మురళి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, సింగార బాలమురళీకృష్ణ సంతాపం తెలిపారు. గొల్లాపిన్ని మృతి జిల్లా సాహిత్య రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు, అధికారులు

తిరుపతి(ఆటోనగర్) మే17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి ప్రహల్లాద జోషి తెలియజేశారు. తిరుమల పర్యటన నిమిత్తం కేంద్రమంత్రి శనివారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్‌కు హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో చేరుకున్నారు. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, బీజేపీ, జనసేన నాయకులు పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ నాయకులు సామంచి శ్రీనావాసులు, గుండాల గోపినాథ్‌రెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖరరెడ్డి, రెడ్డిబాబు, ఎం.రవిప్రసాద్, డాక్టర్ నరేష్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ప్రణాళికలు: ఈవో



తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటికే సమరసత సేవా ఫౌండేషన్, దేవదాయ శాఖ సహకారంతో నిర్మిస్తున్న ఆలయాల తీరుతెన్నులపై నివేదిక తయారు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శనివారం అధికారులతో ఈ ఆలయాలపై సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు నిబంధనలను పునఃసమీక్షించుకుని మరింత మెరుగ్గా, సులభతరంగా, పారదర్శకంగా ఉండేలా తయారు చేయాలన్నారు. సనాతన ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివన్నారు. ఆలయాల నిర్మాణాలతో దైవచింతన, ఆధ్యాత్మిక, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయన్నారు. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల నిర్వహణకు పక్కాగా ప్రణాళికలు, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీఈ టీవీ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో దేవెగౌడ



తిరుమల, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం రాత్రి మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి నైవేద్య విరామ సమయంలో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. స్టేట్ లెవల్ కాన్సులేటివ్ కమిటీ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు చెరుకూరి వెంకటేశ్వరప్రసాద్ కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో శ్రీకృష్ణ అతిథిగృహంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఏపీ అభివృద్ధికి సహకారం అందించాలని ప్రహ్లాద్‌జోషిని కోరారు. కాగా తొలుత కేంద్రమంత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకన్నారు. ఆయనతోపాటు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ కూడా ఉన్నారు.

వీడిన యువకుడి మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి హత్య మిస్టరీ వీడింది. ముక్కంటి ఆలయ సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి గుడి మార్గంలో ఉన్న శ్మశానంలో ఐదు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతి ఈనెల 16న 'ఏం జరుగుతోంది' అన్న శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన ఎస్పీ హర్షవర్ధనరాజు కేసును త్వరితగతిన ఛేదించాలని శ్రీకాళహస్తి పోలీసు అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి సిబ్బందితో కలిసి ముక్కంటి ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. మృతుడిది పాండిచ్చేరిగా గుర్తించారు. శ్రీకాళహస్తి పట్టణం దర్గామిట్టకు చెందిన కొందరు యువకులు అతన్ని హతమార్చినట్లు ఆధారాలతో సహా నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం 6 నుంచి 7 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం సాయంత్రం స్వర్ణరథోత్సవం జరగనుంది. వసంతోత్సవాలు సందర్భంగా ఆలయంలో ఆర్జిత, కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

అతిథిగృహాల ఆచూకీకి అగచాట్లు

● రసీదుల్లో కొనసాగుతున్న పాతపేర్లు



పాండవ గెస్ట్‌హౌస్ అని ముద్రించిన రసీదు

తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అతిథిగృహాల ఆచూకీ గుర్తించేందుకు భక్తులు అగచాట్లు పడుతున్నారు. ఇటీవల అతిథిగృహాలపై పేర్లు మార్చినా గదుల కేటాయింపు రసీదుల్లో పాతపేర్లనే ప్రింట్ చేసి ఇస్తుండటంతో తికమక పడుతున్నారు. అతిథిగృహాలకు దాతల సొంత పేర్లు కాకుండా పవిత్ర ఆధ్యాత్మిక పేర్లు మాత్రమే ఉండాలని ఇటీవల ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈ క్రమంలో 45 అతిథిగృహాలకు పేర్లు మార్చాల్సిన అవసరముందని అధికారులు గుర్తించారు. ఇప్పటికే కొన్నింటి పేర్లను మార్చారు. కొత్త బోర్డులను ఏర్పాటు చేశారు. సిఫార్సు లేఖలను పద్మావతి విచారణ కార్యాలయంలో పరిశీలించి గదులను కేటాయిస్తారు. అయితే గదుల వివరాలతో ఇచ్చే రసీదులో పాతపేర్లే ఉంటున్నాయి. తీరా అక్కడకు వెళితే కొత్త పేరుతో ఉన్న బోర్డులను చూసి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో తిరిగి పద్మావతీ విచారణ కార్యాలయానికి రావడం లేదా సమీపంలో ఉండే వ్యక్తులను గెస్ట్‌హౌస్ వివరాలను చెప్పి అడగడం వంటివి చేస్తున్నారు. గెస్ట్‌హౌస్‌లపై పేర్లు మార్చిన అధికారులు రసీదుల్లో మార్చేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పాండవ గెస్ట్‌హౌస్‌పై 'విరజా నిలయం' బోర్డు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 11,196 మంది దరఖాస్తు చేసుకోగా 10,356 మంది పరీక్షలు రాశారు. 840 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,473 మంది దరఖాస్తు చేసుకోగా 1,380 మంది పరీక్షలు రాశారు. 93 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ ఘటనలు చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

శేషాచలంలో అనధికార ట్రెక్కింగ్ నేరం

● ఫారెస్టు రేంజర్ వెంకటరమణ



భాకరాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో అనుమతి లేకుండా ట్రెక్కింగ్ చేయడం చట్టరీత్యా నేరమని ఫారెస్టు రేంజర్ వెంకటరమణ స్పష్టం చేశారు. శనివారం భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భాకరాపేట రేంజ్ అటవీ ప్రాంతంలో వెంకటేశ్వర అభయారణ్యం, వెంకటేశ్వర జాతీయ ఉద్యానవనం చేర్చారన్నారు. వన మూలికలకు, పక్షి, వృక్ష జాతులకు, ప్రకృతి సహజ సౌందర్యానికి ఈ ప్రాంతం కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడి విశేషాలను సోషల్ మీడియాలో పెడుతూ ప్రకృతి ప్రేమికులను మోసం చేస్తూ కొందరు నగదు వసూలు చేస్తున్నారన్నారు. ఇది చట్టవిరుద్ధమన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోకి ఎవరికీ అనుమతి లేదన్నారు. ట్రెక్కింగ్ చేయడం శిక్షార్హమన్నారు. ఇప్పటికే తొమ్మిది ట్రెక్కింగ్ సంస్థలను గుర్తించి డీఎఫ్‌వో ఆధ్వర్యంలో విచారిస్తున్నారన్నారు. అనధికారికంగా ట్రెక్కింగ్ చేసి ఫొటోలు, వీడియోలు పెట్టిన మహేశ్ బాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశాన్నారు.

నేడు జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బీఎస్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికిగాను జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకుగాను మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్, తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. 8.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తిరుపతి కో-ఆర్డినేటర్ దుర్గ వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలలోపలే పరీక్ష హాల్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలను అనమతించేది లేదని తెలిపారు.

● పరీక్ష అనంతరం షెడ్యూల్ ఇలా.. : అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను ఈ నెల 22న వెబ్‌సైట్‌లో ఉంచుతారు. 26న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. జూన్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు తుది కీ, ఫలితాలు విడుదల చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతంది.

నేడు సైన్స్ సెంటర్‌లో ఉచిత ప్రవేశం

మంగళం, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి సైన్స్ సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. 3డీ షో, డిజిటల్ ప్లానిటోరియం షో, పార్కింగ్‌కు ఫీజు యథావిధిగా ఉంటుందని వివరించారు. మ్యూజియం, విజ్ఞానాన్ని పెంపొందించే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

1100కు కాల్ చేసి అర్జీ స్థితి తెలుసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందజేసిన అర్జీ స్థితి తెలుసుకోవడానికి అర్జీదారులు 1100టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే అదే నంబర్‌కు ఫోన్‌చేసి అప్లికేషన్ లేదా ఆధార్ లేదా మొబైల్ నంబర్లతో అర్జీ స్థితిని తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

తుడా కార్యదర్శి బాధ్యతల స్వీకరణ




తిరుపతి, మే17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యదర్శిగా డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను తుడా సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యేలు, నూతన చైర్మన్, వీసీల సమన్వయంతో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన చెప్పారు.

రాకెట్: పీఎస్ఎల్వీ-సీ 61
ఎత్తు: 44.5 మీటర్లు
బరువు: 321 టన్నులు

ఉపగ్రహం: ఈవోఎస్-09 (రీశాట్-1బీ)
బరువు: 1,696.24 కిలోలు
ప్రయోజనం: దేశ రక్షణ, సైనిక అవసరాలు

నేడే 101వ రాకెట్ ప్రయోగం


ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని హీట్‌షీల్డ్‌లో అమర్చిన దృశ్యం


ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్

● పీఎస్ఎల్వీ శిఖర భాగంలో సిద్ధంగా రీశాట్-1బీ ఉపగ్రహం

సూళ్లూరుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగ సన్నాహాలు తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో పూర్తయ్యాయి.శాస్త్రవేత్తలతో షార్ సందడిగా మారింది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక మీద రాకెట్ నింగిలోకి ఎగిరేందుకు సిద్ధంగా ఉంది. అంతకుముునుపు పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తిచేసి ప్రయోగ వేదిక వద్దకు తరలించి రీశాట్-1బీ ఉపగ్రహాన్ని అనుసంధానం చేశారు. శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ ఆదివారం ఉదయం వరకు 22 గంటలపాటు కొనసాగనుంది.కౌంట్‌డౌన్ సమయంలోనే రాకెట్‌లోని రెండవ, నాల్గవ దశల్లో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమై వున్నారు. ప్రయోగ నేపథ్యంలో షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సముద్ర మార్గాన కూడా జల్లెడపట్టి గాలిస్తున్నారు.పీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఇది 63వ ప్రయోగం కాగా షార్ నుంచి 101 ప్రయోగం కావడం విశేషం. 18 నిమిషాల్లో నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని రాకెట్ చేరవేస్తుంది.

నాలుగు దశల్లో ..

139 టన్నుల ఘన ఇంధనం గల మొదటి దశ భూమికి 69 కి.మీ ఎత్తులోకి 111.64 సెకన్లకు పూర్తవుతుంది. 41 టన్నుల ద్రవ ఇంధనం గల రెండవ దశ 264.34 సెకన్లకు 231 కి.మీ ఎత్తులోకి ఉపగ్రహాన్ని తీసుకువెళ్తుంది. మూడో దశలో 7.65 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. 493 సెకన్లకు 443 కి.మీ ఎత్తులోకి శిఖరభాగాన్ని చేరుస్తుంది. 2.5 టన్నుల ద్రవ ఇంధనం గల నాలుగో దశ 503.40 సెకన్లకు ప్రారంభమై 1012.24 సెకన్లకు 533 కి.మీ ఎత్తులోకి చేరుతుంది. 1059.24 సెకన్లకు 530 కి.మీ ఎత్తులో నిర్ణీత కక్ష్యలోకి రీశాట్-1బీ ఉపగ్రహాన్ని చేరవేస్తుంది. ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన వెంటనే భూకేంద్రాలకు సంకేతాలు అందుతాయి.


షార్ మొదటి గేటు వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీలు

అప్పులిచ్చి తిప్పలు

డీసీసీబీకి తొలనొప్పిగా మారిన మొండి బకాయిలు

రికవరీకి వెళ్తున్న సిబ్బందికి చుక్కలు

మొండి బకాయిలు రూ.368 కోట్లు

వసూలయ్యింది రూ.9 కోట్లు మాత్రమే



చిత్తూరు కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కి మొండి బకాయిలు తలనొప్పిగా మారాయి. వైసీపీ హయాంలో పాలకుల ఒత్తిళ్లతో వివిధ పథకాల కింద లబ్ధిదారులకిచ్చిన రుణాలు వసూలు చేయడానికి అధికారులు తిప్పలు పడుతున్నారు.డీసీసీబీ పరిధిలోని 75 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండోలు) ద్వారా ఈ ఏడాది మార్చి నాటికి పంట రుణాల కింద రూ.354 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ. 14కోట్లు వసూలు కావాల్సివుంది. అతికష్టం కింద రూ. 9 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. వీటిని చెల్లించేందుకు లబ్ధిదారులు మొఖం చాటేయడంతో రికవరికి వెళ్ళిన సిబ్బంది వట్టి చేతులతో తిరిగి వస్తున్నారు. రుణం తీసుకుని ఏర్పాటు చేసిన యూనిట్లు సైతం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. చాలావరకు యూనిట్లను అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారే తప్ప బ్యాంకులకు రుణాలు చెల్లించలేదు. సింగిల్ విండోల కంప్యూటరీకరణ గత ఆదివారంతో పూర్తికాగా, లెక్కలు ఒక్కొక్కటిగా బయట వస్తున్నాయి. ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ట్రాక్టర్ల రుణాలకు సంబంధించి లాంగ్ టర్మ్ కింద ఏటా బకాయిలు చెల్లించకపోతే పారు బకాయిలు (రాని బకాయిలు) కింద లెక్కవేస్తారు. డిఫాల్టరుగా తేలితే ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవచ్చు. వారి ఆస్తులను జప్తు చేయవచ్చు. అయితే అధికారులు ఈ సాహసం చేసే పరిస్థితి లేదనే విమర్శలు వస్తున్నాయి.

● **రూ. 85కోట్ల బకాయిలు**

గత మార్చి నాటికి 75 సింగిల్ విండోల ద్వారా స్వల్పకాలిక రుణాల కింద రూ. 80 కోట్లు , దీర్ఘకాలిక రుణాల కింద రూ. 5కోట్లు వసూలు కావాల్సి ఉంది. వైసీపీ హయాంలో జగనన్న తోడు పథకం పేరుతో చిరువ్యాపారులకు డీసీసీబీ నుంచి రూ.10వేల చొప్పున రుణాలు ఇప్పించారు. ఏడాదిలోగా వాటిని తిరిగి చెల్లించాల్సివున్నా, మూడేళ్ళయినా ఆ ఊసే లేదు. ట్రాక్టర్లతో సహా యాంత్రీకరణ రుణ పరికరాలను కస్టమ్స్ అండ్ హైరింగ్ సెంటర్ల పేరుతో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల విలువైన యూనిట్లను అందజేశారు.వాటిలో చాలావరకు యూనిట్లు అమ్మేసుకున్నారు. యంత్రపరికరాలు కనిపించడం లేదు. రైతుల పేరుతో వైసీపీ నేతలే వాటిని సొంతం చేసుకోవడంతో రికవరీకి అధికారులు ఇబ్బంది పడాల్సివస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి నెల మధ్య అధికారులు వసూళ్ళకు వెళ్ళగా, మేనేజర్, డివిజనల్ కోఆపరేటివ్ అధికారుల సహకారంతో ఎట్టకేలకు స్వల్పమొత్తాల మొండి బకాయిలు జమయ్యాయి.

● **రికవరి చేస్తాం**

జిల్లాస్థాయిలో రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దీర్ఘకాలిక రుణాల బకాయిలే ఎక్కువగా ఉన్నాయి. ఇవన్నీ వసూలు చేయడానికి అన్నివిధాలా ప్రయత్నిస్తున్నాం. మొండి బకాయిదారుల జాబితాలు సొసైటీలవారీగా సేకరిస్తున్నాం. నోటీసుబోర్డులో పెట్టి వారి ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- సి. శంకర్ బాబు,డీసీసీబీ సీఈవో

రూ.70 కోట్లతో కుప్పం డిపో ఆధునికీకరణ


ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపో, బస్టాండ్లను రూ.70 కోట్లతో ఆధునికీకరించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం తెలిపారు. ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం కేటాయించిన 15 నూతన బస్సు సర్వీసులను వారు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుప్పం డిపోను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన డిపోగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అవసరమైన నిధులను కేటాయించారని, త్వరలోనే సంబంధిత పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. డీజిల్ బస్సుల స్థానంలో పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సులు తెస్తామన్నారు. కుప్పం అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.గోపీనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, ఆర్టీసీ డీఎం గోపీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ దినేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్ తదితరులతోపాటు ఆర్టీసీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్


చంద్రబాబుకు రాజశేఖర్ దంపతుల సత్కారం

కుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రాజశేఖర్ శుక్రవారం రాత్రి అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తనకు ఆ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు సతీసమేతంగా కలిసి సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. పార్టీకోసం, రాష్ట్రాభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు.

సింహవాహనీ శిరసా నమామి..!



కుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాల్లో నాలుగో రోజైన శనివారం రాత్రి ముత్తుమారెమ్మ అమ్మవారికి సింహవాహన సేవ కడు వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయమే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. పుష్పమాలలతో అలంకరించారు. రాత్రివేళ సర్వాంగ సుందరంగా పుష్పాలతో అలంకరించిన ముత్తుమారెమ్మను సింహవాహనంపై అధిష్ఠింపజేసి పుర వీధుల్లో ఊరేగించారు. వీధుల్లో బారులుతీరిన భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అప్పు చెల్లించలేదని గర్భిణి నిర్బంధం!


మీడియా సమావేశంలో భరత్‌కుమార్

చిత్తూరు సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని గర్భిణి అయిన తన భార్య యువరాణిని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ రికవరీ ఏజెంట్లు అక్రమంగా నిర్బంధించారని గంగాధరనెల్లూరు మండలం అక్కన్నగారిపల్లెకి చెందిన భరత్ కుమార్ ఆవేదన వ్యక్తంచేశాడు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాకు వివరాలు తెలిపాడు. ఆయన మాటల్లోనే.. '2023లో హీరో ఫిన్ కార్పొరేషన్ ప్రైవేట్ కంపెనీ నుంచి రూ.1.50 లక్షలు రుణం తీసుకున్నాను. 36 నెలల్లో అప్పు తీర్చేలా ఒప్పందం చేసుకున్నాను. 22 నెలలుగా కంతులను కడుతూ వచ్చాను. అనారోగ్యం కారణంగా ఇటీవల కొన్ని నెలలుగా కంతులను చెల్లించలేదు. రెండ్రోజుల కిందట రికవరీ ఏజెంట్లు వచ్చి గర్భిణిగా ఉన్న నా భార్య యువరాణిని తీసుకెళ్లి అక్రమంగా నిర్బంధించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. చివరకు తెలిసినవారి సాయంతో నా భార్యను విడిపించుకున్నాను' అని భరత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.75 కోట్లు


హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం), మే 17 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ద్వారా రూ.1,75,36,760 ఆదాయం లభించింది. ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో శనివారం స్వామి కానుకలను సిబ్బంది లెక్కించారు. 208 యూఎస్ఏ, 112 సింగపూర్ డాలర్లు, 32 మలేసియా రింగిట్స్, 170 యూఏఈ దిర్హామ్స్‌తోపాటు 49 గ్రాముల బంగారు, 1,425 గ్రాముల వెండి లభించింది. గోసంరక్షణ హుండీ ద్వారా రూ.10,569, అన్నదానసత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.41,660 సమకూరింది. ఈ ఆదాయం పూర్తిగా ఆలయానికి 26 రోజుల్లో సమకూరినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అరగొండ అపోలో ఆస్పత్రిలో తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలు



వివరాలు తెలియజేస్తున్న డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డి

తవణంపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): అరగొండ అపోలో ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహిస్తున్న తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలను గ్రామీణ ప్రాంతాల్లోని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య నిపుణుడు మదన్‌మోహన్‌రెడ్డి, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా శనివారం ఆస్పత్రిలో మీడియాకు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ- పట్టణాలకే పరిమితమైన అత్యాధునిక వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ వ్యయంతో అందించాలని అపోలో అధినేత ప్రతాప్ సి రెడ్డి తన స్వగ్రామం అరగొండలో అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. తుంటిమార్పిడి శస్త్ర చికిత్స చేసుకున్నవారు రెండో రోజే నడవవచ్చన్నారు. వైద్యులు కార్తీక్, శ్రీనివాసులు, ప్రవీణ్, పీఆర్వో కమరుద్దీన్, అపోలో సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి సీబీఎస్‌లో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్


ఆటోమెటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్నా డీపీటీవో, ఏటీఎం

తిరుపతి(ఆర్టీసీ), మే 17(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను తొలిసారిగా ఏర్పాటు చేశారు. ఈ విధానాన్ని శనివారం జిల్లా ప్రజారవాణాధికారి వెంకటరావు ప్రారంభించారు. రిజర్వేషన్ విధానం కలిగివున్న ప్రతి బస్సు 500మీటర్ల దూరం నుంచి సీబీఎస్‌కు ప్రవేశిస్తుండగా ఆటోమేటిక్‌గా అనౌన్స్‌మెంట్ వినిపిస్తుంది. త్వరలోనే అన్ని బస్సులకు ఈ విధానం విస్తరించేలా చర్యలు చేపడుతామని డీపీటీవో తెలియజేశారు. అనంతరం స్వచ్ఛఆంధ్ర -స్వర్ణఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆర్టీసీ డ్రైవర్లకు, ప్రయాణికులకు పంపిణీ చేశారు. అలాగే పలువురు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, సంధ్య, ఈఈ లక్ష్మీనారాయణ, ఈ.ఆర్.కుమార్, పురుషోత్తం, హర్ష తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులకు నివాళులు



ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన దాడుల్లో మృతి చెందిన అమరవీరులకు భారతీయులు ఘన నివాళులర్పిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఎం. వెంకటరమణరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక తూర్పుమొగసాల నుంచి టీడీపీ శ్రేణులతో కలిసి ఎన్టీఆర్ సర్కిల్ వరకు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి దేశ ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రాయల్, పెద్దమోహన్‌నాయుడు, నూరుల్లా, అనిల్‌రాయల్, నూర్బా, పర్వేజ్, ముబాకర్, జగదీష్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి రూ.1.12 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, వెంకటాద్రి నాయుడు తదితరులు

శాంతిపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో వెలిసిన తిరుపతి గంగమ్మ ఆలయానికి భూదానం కోసం శాంతిపురం మండల మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు, శాంతిపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర మాజీ చైర్మన్ వెంకటాద్రి నాయుడు కుటుంబ సభ్యులు 15 అడుగులకు గాను రూ.1,12,500 విరాళాన్ని చైర్మన్ బీఎంకే రవిచంద్రబాబుకు అందించారు. శనివారం నందిగం కుటుంబ సభ్యులు కుప్పం తిరుపతి గంగమ్మను దర్శించుకున్నారు. అలాగే మాజీ టీడీపీ మండలాధ్యక్షుడు విజయరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,05,000 అందించారు. అలాగే శాంతిపురం జనార్దన్‌నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో రూ.37,500 విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మణి, జాని, సింగిరి శ్రీనివాసులు, నాగరాజు, మురుగప్ప, మురళీ తదితరులు పాల్గొన్నారు.

గానుగచింత టీడీపీ అధ్యక్షుడిగా శేషాద్రినాయుడు



గానుగచింతలో సభ్యత్వ కార్డులతో టీడీపీ కార్యకర్తలు

రొంపిచెర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామంలో శనివారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని నాయకులు, కార్యకర్తల సమక్షంలో సమావేశం నిర్వహించి గానుగచింత గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా శేషాద్రి నాయుడు, కార్యదర్శిగా ముద్దుకృష్ణ ఎంపికయ్యారు. కార్యక్రమంలో నాయకులు అమరనాథరెడ్డి, కృష్ణమనాయుడు, మధుసూదన్‌నాయుడు, మాజీ సర్పంచ్ జయరామయ్య, మల్లికార్జుననాయుడు, రాజేంద్ర, ఈశ్వరనాయుడు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్యుడితో మాట్లాడుతున్న జిల్లా క్షయ అధికారి వెంకటప్రసాద్

రొంపిచెర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా క్షయ అధికారి డాక్టరు వెంకటప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఆస్పత్రిలో సమస్యలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 60 ఏళ్లకు పైబడి బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్న, పొగతాగుతున్న వారికి టీబీ పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టరు దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి విరాళాలు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి విరాళం అందజేస్తున్న దాతలు

సోమల, మే 17 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ప్రతిష్ఠకు దాతలు విరాళాలు అందజేసినట్లు ఆ కమిటీ అధ్యక్షుడు మునివెంకటప్ప తెలిపారు. శనివారం నడింపల్లె పంచాయతీ కరకమందలో మాజీ వైస్ ఎంపీపీ లలితమ్మ, వాసుదేవ కుమార్ దంపతులు రూ.1,00,116, మాజీ సర్పంచ్ సదాశివయ్య రూ.10,001, చెన్నమల్లయ్య రూ.10,116, గురుశంకర్ రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జ్యోతీశ్వరుడు, సాంబయ్య, సాంబశివయ్య, డాక్టర్ హరానారాయణ, నగేశ్, రఘు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ హనుమంతు

చౌడేపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసమే మానిటరింగ్ సమావేశ లక్ష్యమని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శ్మశానాలు, ఉపాధి పనుల కోసం విన్నవించారు. అలాగే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో, లద్దిగం పీహెచ్‌సీలో వైద్యులు సక్రమంగా అందుబాటులో లేరని, పలు చోట్ల విద్యుత్ సమస్యలున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రామ్మూర్తి, ఎంపీడీవో లీలామాధవి, ఎస్ఐ నాగేశ్వరరావు, ఏవో జ్యోతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, మండల స్థాయి అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు తప్పనిసరిగా అమలు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఎం.లిఖిత

పలమనేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు డెయిరీలో పనిచేస్తున్న కార్మికులందరికీ కార్మిక చట్టాలను వర్తింపజేయాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.లిఖిత సూచించారు. శనివారం పలమనేరు సమీపంలోని ఓ డెయిరీలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల పనివేళలు, అందుతున్న సౌకర్యాలను జడ్జి డెయిరీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెయిరీలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. డెయిరీ సిబ్బంది, అధికారులు కార్మిక చట్టాల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అరీఫుల్లాఖాన్, డెయిరీ హెచ్ఆర్ సుదర్శన్, మేనేజర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాజనాలబండలో ఆంజనేయస్వామికి పూజలు



చౌడేపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు కొండపైన వెలసిన నరసింహస్వామి, అంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు



గంగమ్మ ఆలయంలో హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో కమలాకరరావు, చైర్మన్ శ్రీధర్‌నాయుడు

పలమనేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని గంగమ్మ ఆలయంలో శనివారం ఈవో కమలాకరరావు, చైర్మన్ శ్రీధర్‌నాయుడు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో గంగ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక హుండీ ఏర్పాటు చేశారు. జాతర అనంతరం లెక్కింపు చేపట్టారు. భక్తులు అమ్మవారికి రూ.8,76,230 కానుకల రూపంలో చెల్లించారు.

రోషన్ ఆలీఖాన్ కుటుంబాన్ని ఆదుకోవాలి



ఎంఈవో బాలసుందరానికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుడి సతీమణి మాలిన్

పలమనేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో ఇటీవల మృతిచెందిన ఎంటీఎస్ ఉపాధ్యాయుడు రోషన్ ఆలీఖాన్ కుటుంబాన్ని ఆదుకోవాలని ఉపాధ్యాయ సంఘ సీనియర్ నాయకులు సోమచంద్రారెడ్డి కోరారు. గత పదిరోజుల క్రితం రోషన్ మృతిచెందగా.. ఆ ఉపాధ్యాయుడి సతీమణి పి.మాలిన్, కుమారుడు సాదిక్ శనివారం ఎంఈవో బాలసుందరాన్ని కలిసి ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ప్రధానోపాధ్యాయులు షంషీర్, విశ్రాంత ఉపాధ్యాయులు నాగభూషణం, ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఏఆర్ కుమార్ పాల్గొన్నారు.

గాలివానకు నేలవాలిన పంటలు

పలమనేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న గాలివానకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని పలు మామిడి తోటల్లో దాదాపు 30 శాతం మామిడికాయలు రాలిపోయాయి. కోతకు వచ్చిన రాగి, వరి నేలవాలాయి. అరటి, మామిడి చెట్లు ధ్వంసమయ్యాయి. టమోటా, బీర పంటలు సైతం దెబ్బతిన్నాయి. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పులిచెర్ల ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవో రాజశేఖర్‌బాబును సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఎంపీడీవో రాజశేఖర్‌బాబును ఘనంగా సన్మానించారు. పులిచెర్ల ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌బాబు గత కొద్ది నెలలుగా ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఈవోపీఆర్డీలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించడంతో ఆయనకు పదోన్నతి లభించింది. ఈక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్, కార్యాలయ ఏవో మునిరాజ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

తవణంపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. తవణంపల్లె పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాణిపాకపట్నం సమీపంలోని బెంగళూరు-తిరుపతి హైవేలో ప్రైవేటు దాబా వద్ద ఓ యువకుడు (40) శుక్రవారం రాత్రి నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి

● ఎంపీపీ సులోచన ● మండల సమావేశానికి వైసీపీ ఎంపీటీసీల గైర్హాజరు



మండల సమావేశంలో ఎంపీపీ తదితరులు

రామకుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే మండలాభివృద్ధి సాధ్యమని.. ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీపీ సులోచన అన్నారు. శనివారం ఆమె అధ్యక్షతన రామకుప్పం మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన ఎంపీపీ ఎన్నిక అనంతరం జరిగిన మండల సమావేశానికి వైసీపీ ఎంపీటీసీలు డుమ్మా కొట్టారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలతోపాటు ఐదుగురు ఎంపీటీసీలు హాజరుకావడంతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలన్నదే తమ అభిమతమన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా సీఎం చంద్రబాబు మండలం అభివృద్ధికి ఎంతో సహకారం అందిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందించంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే ఈ విషయంలో రాజకీయాలు పక్కనపెట్టి ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు సైతం తమతో కలిసి రావాలన్నారు. మండలంలో పలుచోట్ల చెరువులు, శ్మశానాలు ఆక్రమణలకు గురయ్యాయని, ఆక్రమణలు తొలిగింపునకు సత్వరం చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. అలాగే పంచాయతీల్లో నిధుల లేమి కారణంగా తాగునీటి సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని, ప్రభు త్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సర్పంచులు కోరారు. విజలాపురం సమీపంలోని సంతమిట్ట వద్ద వైసీపీ ప్రభుత్వంలో కొందరు వ్యక్తులు 35మంది పేరిట నకిలీ ఇంటి పట్టాలు సృష్టించి జనానికి అంటగట్టి లక్షల్లో డబ్బులు వసూలు చేశారని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని కోరారు. అలాగే మండలంలో ఐదేళ్లుగా 150కి పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, డీఎస్సీలో వాటిని భర్తీ చేయాలని సభ్యులు కోరారు. వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు, తహసీల్దారు కౌలేష్, ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు భూపతి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుడుపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామిగానిపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ద్రౌపదీ రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూలవిగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం ద్రౌపదీ ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, ఆభరణాలు, రంగురంగుల పుష్పాలతో అలంకరించి రథోత్సవంపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు అడుగడుగునా అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు అందించారు. సాయంత్రం వివిధ గ్రామాల నుంచి రైతులు పశువులను అలంకరించి ఆలయం ఎదుట ఊరేగించారు. ఆలయ కమిటీ తరఫున భక్తులకు అన్నదానం చేశారు.

20న రాయలపేటలో పటాలమ్మ జాతర

పెద్దపంజాణి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలపేటలో ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పటాలమ్మ గంగజాతర ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు, బుధవారం ఉదయం పటాలమ్మ విశ్వరూప దర్శనం ఉంటుందన్నారు. గురువారం ఉదయం నిమజ్జనంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

కల్యాణ వెంకన్నకు పుష్పపల్లకి సేవ



బైరెడ్డిపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పుష్పపల్లకి సేవ శుక్రవారం రాత్రి కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు మురళీకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకిలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ఊరేగించారు. బైరెడ్డిపల్లెకు చెందిన అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పోస్టర్లను నేతలతో కలిసి డీఆర్వో మోహన్ కుమార్ శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం రాష్ట్ర సివిల్ సర్వీసెస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఒక్కటేనని జిల్లా అధ్యక్షుడు శివయ్య చెప్పారు. వచ్చే నెల ఐదో తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నేతలు నరేష్‌కుమార్, దేవకుమార్, హరిప్రసాద్, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

చౌడేపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): బాలికను గర్భిణిని చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 7న ఓ బాలికను మండలంలోని నూనిముద్దనపల్లెకు చెందిన పురుసు నాగేంద్ర గర్భిణిని చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాగేంద్రపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలి

రామకుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం నుంచి పలు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలన్న ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. రామకుప్పం నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరు, అదే రాష్ట్రంలోని ముళబాగల్, విజయపుర పట్టణాలకు, తమిళనాడు రాష్ట్రం వానియంబాడీ పట్టణానికి, మండల పరిధి విజలాపురం నుంచి వి.కోట మండలం పాతూరు, వి.కోట మీదుగా తిరుపతికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని మండల ప్రజలు దశాబ్దాలుగా కోరుతున్నారు. విద్యా, వాణిజ్య, సామాజికంగా మండల వాసులు ఆ పట్టణాలతో సంబంధాలు కలిగి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రామకుప్పం నుంచి నేరుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక పోవడంతో రెండు మూడు చోట్లకు ప్రైవేటు బస్సుల్లో వెళ్లి గమ్య స్థానాలకు చేరుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రజలు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాలు ఘర్షణ పడి ఇద్దరు గాయపడిన సంఘటన పుంగనూరులో శనివారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. పట్టణంలోని ఎన్ఎస్‌పేటకు చెందిన మహ్మద్ కుమారుడు ఫయాజ్(36) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పట్టణ సమీపంలోని గూడూరుపల్లె సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద డ్రైవర్లు గణేశ్, ఫయాజ్‌లు శుక్రవారం రాత్రి మద్యం తాగుతూ డబ్బుల కోసం ఘర్షణ పడుతుండగా అదే సమయానికి గూడూరుపల్లెకు చెందిన నరేశ్, నవీన్‌లు ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతూ ఘర్షణ పడొద్దని సూచించడంతో ఫయాజ్ బీరు బాటిల్‌తో నరేశ్, నవీన్‌లపై దాడి చేశాడు. ఈ ఘర్షణలో నవీన్, ఫయాజ్‌లు గాయపడ్డారు. అప్పటికే గ్రామస్థులు గుర్తించి గాయపడిన వీరిని ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య భద్రత



పలమనేరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్



శాంతిపురంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న గౌనివారి శ్రీనివాసులు

పలమనేరు, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పచ్చదనం.. పరిశుభ్రతకు కృషి చేయాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి సూచించారు. శనివారం పలమనేరులో ఆయన ఆధ్వర్యంలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా స్థానిక దండపల్లి క్రాస్ రోడ్డులోని శ్రీనాథ్ లేఅవుట్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు, స్థానికులచే ప్రతిజ్ఞ చేయించారు. బాపూజీ ఉద్యానవనంలో నాగమణి ట్రస్టు నిర్వాహకులు శ్రీపురం సీతారామయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, డీఈ సురేష్ బాబు, ఏఈ స్నేహప్రియ, టీపీఎస్ ఇందిర, డాక్టర్లు కుమారి, చందనప్రియ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● శాంతిపురం: పల్లెలు శుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. శనివారం వెంకటేపల్లె గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి అశ్వత్‌నారాయణ, సర్పంచ్ ఏఈ జయరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని వీధులను పంచాయతీ కార్మికులు, ప్రజలతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించి కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

● పెద్దపంజాణి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో బాలాజీ సూచించారు. శనివారం మండలంలోని కోగిలేరు సచివాలయం వద్ద మొక్కలు నాటి అవగాహన కల్పించారు. సర్పంచ్ రమేష్ బాబు, ఈవోపీఆర్డీ శారదాదేవి, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

● రామకుప్పం: మండల సచివాలయం ఆవరణలో శనివారం ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడులు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ననియాల ఎకో టూరిజం కేంద్ర ఆవరణలో అటవీ విభాగాధికారి హరికుమార్ అటవీ అధికారులు మొక్కలు నాటారు. తహసీల్దారు కౌలేష్, ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, డీవైఆర్‌వో ధనుంజయ్, నాయకులు పాల్గొన్నారు.



● రొంపిచెర్ల: ప్రజలు వైద్యుల సలహాలు, సూచనల మేరకు అధిక రక్తపోటు తగ్గించుకోవాలని వైద్యాధికారి దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. శనివారం ర్యాలీ నిర్వహించి శుభ్రతపై అవగాహన కల్పించారు. హెచ్ఈ రాజేశ్వరి, కార్యదర్శి హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● సోమల: సోమల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండల స్థాయి అధికారులు శనివారం మొక్కలు నాటారు. తహసీల్దార్ బెన్నురాజ్ , ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● పుంగనూరు: వాతావరణ కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ చేశారు. టీడీపీ నాయకులు సీవీరెడ్డి, ప్రకాష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కొందరు అధికారుల తీరుతో
రాష్ట్రానికి తలవంపులు: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పనిచేసిన కొందరు అధికారులు రాష్ట్రానికి తలవంపులు తీసుకొచ్చారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్‌రెడ్డి సీఎంగా పనిచేసిన సమయంలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు జగన్‌కి ఊడిగం చేయడం వల్ల వారి రోజు ఊచలు లెక్కపెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్ సీఎంగా ఉన్నపుడు ఐఏఎస్‌లను భయపెట్టి తప్పుడు పనులు చేయించి వాళ్ల జైలుకు వెళ్లేలా చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో డీజీపీ స్థాయి అధికారి సీతారామాంజనేయులు, ఐఏఎస్, కేంద్ర సర్వీస్ అధికారులు వాసుదేవ రెడ్డి, వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డితోపాటు పలువురు జైలు పాలవడం దురదృష్టకరమని అన్నారు. అధికారులు జైలు పాలవుతుండటంతో వారి కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని చెప్పారు. సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, ధరణి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం టీడీపీ అధ్యక్షుడిగా ధరణీ ప్రసాద్


ధరణీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఎన్పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్పీ ధరణీప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం చిత్తూరులోని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీమోహన్, నియోజకవర్గ అబ్జర్వర్ బొమ్మన శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. నలగాంపల్లెకు చెందిన మాజీ మార్కెట్ ఛైర్మన్ జయచంద్రనాయుడు కుమారుడు ఎన్పీ ధరణీ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని, గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కష్టపడతానని చెప్పారు. మాజీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, నాయకులు కోదండయాదవ్, జనార్ధన్ గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, ఎన్పీ శ్రీనివాసులు నాయుడు, ఎన్పీ నవీన్, హేమచంద్రనాయుడు, బీసీ రవీంద్రనాయుడు, నాగరాజగౌడ్, లోకనాథనాయుడు, హరిప్రసాద్, రమేష్, చిన్నయ్య, గిరిబాబు, శివ పాల్గొన్నారు.

యాదమరికి మురార్జీ యాదవ్



యాదమరి, మే 17 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల టీడీపీ అధ్యక్షుడిగా మురార్జీ యాదవ్ మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన దళవాయిపల్లెకు చెందిన సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. గతంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా, తాజాగా మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. 2006లో సర్పంచ్‌గా, 2013లో ఎంపీటీసీగా ఉంటూ, వైస్ ఎంపీపీగానూ పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పార్టీ నేతలు, కార్యకర్తలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి కోదండ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐరాల టీడీపీ అధ్యక్షుడికి సన్మానం


హరిబాబును సన్మానించిన నాగేశ్వరరావు

ఐరాల(కాణిపాకం), మే 17 (ఆంధ్రజ్యోతి): ఐరాల టీడీపీ అధ్యక్షుడిగా గంగారపు హరిబాబు నాయుడిని ఎన్నుకోవడం ఆనందంగా ఉందని మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. శనివారం ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన వారందరికీ హరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ను కలిశారు.

పీఆర్ కండ్రిగ టీడీపీ అధ్యక్షుడిగా చంద్రబాబు

విజయపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): పీఆర్ కండ్రిగ గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా చంద్రబాబును శనివారం మండల ఎన్నికల పరిశీలకులు ధనుంజయనాయుడు, జానా వెంకటయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ఎన్నుకున్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నేతలు శివయ్యనాయుడు, సుధానాయుడు, శివలింగం పాల్గొన్నారు.

మునీశ్వరాలయానికి రూ.50వేల విరాళం

నగరి, మే 17 (ఆంధ్రజ్యోతి): నగరి బస్టాండు సమీపంలోని మునీశ్వరస్వామి ఆలయానికి రూ.50వేల విరాళాన్ని రాష్ట్ర పట్టు పరిశ్రమ మాజీ అధ్యక్షుడు ఏఎం రాధాకృష్ణ కుటుంబీకులు శనివారం అందించారు. ఆలయ నవీకరణలో భాగంగా స్థానికుల విరాళాలతో మునీశ్వరచెట్టు పీఠం, పొంగళ్లు పెట్టే గది, విశ్రాంతి గది, బాత్‌రూమ్‌లు, ప్రహరీ తదితర పనులను నిర్వాహకులు చేపట్టారు.

ఘనంగా అలుగు ఉత్సవం

నింద్ర, మే 17 (ఆంధ్రజ్యోతి): అత్తూరు గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా అలుగు ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని పాండవుల ఉత్సవర్లకు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం కుండపై అలుగు కత్తిని నిలబెట్టారు. ఉభయదాతగా పీఎస్ రాధాకృష్ణారెడ్డి వ్యవహరించారు. మధ్యాహ్నం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఓరూరు పేటకు చెందిన గంధమనేని రాజేష్ ప్రారంభించారు. దాతలుగా పులిపాడుకు చెందిన బెంగళూరు వాసి రమేష్, అత్తూరుకు చెందిన నాగేష్‌రెడ్డి (హెడ్ మాస్టర్) వ్యవహరించారు.

శారీరక శ్రమ, యోగాతో బీపీ దూరం

చిత్తూరు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): శారీరక శ్రమ, యోగా, వాకింగ్ చేస్తే బీపీకి దూరంగా ఉండొచ్చని డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. శనివారం ప్రపంచ హైపర్ టెన్షన్ దినం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ప్రపంచ హైపర్ టెన్షన్ డేపై కార్వేటినగరం మండలం కత్తెరపల్లె పీహెచ్‌సీ నుంచి ర్యాలీ చేపట్టారు. మెడికల్ ఆఫీసర్ భువనేశ్వరి, సీహెచ్‌వో రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరి, ఆరోగ్య పర్యవేక్షకుడు త్యాగు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించండి: డిప్యూటీ కలెక్టర్

పూతలపట్టు, మే 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూపరంగా వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డిప్యూటీ కలెక్టర్ అనుపమ సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులకు ఆమె పలు సూచనలిచ్చారు. తహసీల్దార్ రమేష్ బాబు, సర్వేయర్ చంద్రశేఖర్, డీటీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15 ఏళ్ల భూ సమస్యకు పరిష్కారం


బాధితులకు 1బీలను అందిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

చిత్తూరు రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు 15 ఏళ్ల భూ సమస్యను పరిష్కారం లభించింది. చిత్తూరు నగరంలోని కట్టమంచి రెవెన్యూ గ్రామం దొడ్డిపల్లె సర్వే నెంబరు 9/1లో శాంతి(65), హరినాథ్, మహేంద్ర, లీలావతిలకు చెందిన భూములు ఉన్నాయి. వీటికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. తమకు పాసుపుస్తకం ఇప్పించాలని 15 ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ బాధితులు తిరుగుతూనే ఉన్నారు. చివరకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఈ సదస్సులో అర్జీ సమర్పించారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపి జేసీ ద్వారా సమస్యను పరిష్కరించారు. శనివారం వీరందరికీ 1బీలను చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. దీంతో వారు ప్రభుత్వానికి, కలెక్టర్, జేసీలకు కృతజ్ఞతలు తెలిపారు.

మూడు మండలాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): విజయపురం, నింద్ర, నగరి మండలాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సదాశివం తెలిపారు. 132 కేవీ లైన్ మరమ్మతులు జరుగుతాయని, వినియోగదారులు సహరించాలని కోరారు.

స్పోకెన్ ఇంగ్లీష్‌పై ఉచిత శిక్షణ

నగరి, మే 17 (ఆంధ్రజ్యోతి): పుదుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు పినాక ప్రజాసాధికార ట్రస్టు, ఐఆర్ఎస్ యాదగిరి ఆధ్వర్యంలో జూన్ ఆరో తేదీవరకు స్పోకెన్ ఇంగ్లీషుపై ఉచిత శిక్షణ, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించనున్నట్లు ఎంఈవో నమశ్శివాయ తెలిపారు. హాజరయ్యేవారికి స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్నారు.



రైల్వేగేటు వద్ద వాహనదారుల కోసం ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్ - అంబేడ్కర్ భవన్ వద్ద మొక్క నాటి, నీరు పోస్తున్న మేయర్ అముద, తదితరులు

నగరంలో 'బీట్ ది హీట్'

చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి వేడి నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేయర్ అముద పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మెసానికల్ మైదానం వద్ద ఉన్న రైల్వేగేట్, అంబేడ్కర్ భవన్ ఆవరణంలో 'బీట్ ది హీట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వేగేట్ పడినప్పుడు వాహనదారులు ఎండవేడికి ఇబ్బంది పడకుండా గ్రీన్‌మ్యాట్‌తో కప్పు వేయించారు. వాహనదారులకు మేయర్‌తోపాటు చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్‌లు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. అనంతరం అంబేడ్కర్ భవన్ వద్ద మొక్కలు నాటి నీరుపోశారు. వేసవి నేపథ్యంలో పక్షుల కోసం చెట్ల కొమ్మల్లో పాత్రలు పెట్టి, వాటిల్లో నీటిని పోశారు. అక్కడే భవన నిర్మాణ కార్మికులకు మజ్జిగను పంపిణీ చేశారు. కమిషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ.. నగరంలో శనివారం 500 మొక్కలు నాటామన్నారు. గృహ నిర్మాణ కార్మికుల కోసం మొబైల్ చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సీఎంఎం వెంకటరమణ, కార్పొరేటర్ అశోక్, బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో సారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న పోలీసులు


విజయపురం దళితవాడపై ఎగురుతున్న డ్రోన్

విజయపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): విజయపురం దళితవాడ(మంగళం)లో నవోదయం 2.0లో భాగంగా శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్స్‌మెంటు, నగరి, పుత్తూరు, నాగలాపురం పోలీసులు, తమిళనాడు పోలీసులు సమష్టిగా ఈ కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ ఎగురవేసి ఎక్కడెక్కడ సారా, బెల్లం ఉందో పరిశీలించారు. 10లీటర్ల సారాను సీజ్ చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అలాగే గ్రామంలో రికార్డుల్లేని ఆరు బైకులను స్వాధీనం చేసుకుని, విజయపురం పోలీసు స్టేషన్‌కు తరలించినట్టు డీఎస్పీ అజీజ్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంటు డీఎస్పీలు కృష్ణకిషోర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయపురం, నగరి, పుత్తూరు, నాగలాపురం, తిరుత్తణి ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు

- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

వెదురుకుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ అజీజ్ శనివారం పరిశీలించారు. ఆలయ అధికారులకు పలు సూచనలిచ్చారు. సీఐ హనుమంతప్ప, కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, కార్వేటినగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను విద్యార్థులకు డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు వితరణ చేశారు.

ఉపాధ్యాయుడు షంషీర్‌కు సత్కారం



బంగారుపాళ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): టేకుమంద జడ్పీ హైస్కూల్‌లో సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షంషీర్‌ఖాన్‌ను తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, భవానీ సాహిత్యవేదిక కరీంనగర్‌వారు హైదరాబాదులోని రవీంద్ర భారతిలో శుక్రవారం సన్మానించారు. పెహల్గామ్ కవితా సంకలనంలో భాగంగా తాను రాసిన ఉగ్రవాదం-ప్రగతి నిరోధకం అనే కవిత ప్రచురించబడడంతో సన్మానించినట్లు షంషీర్ ఖాన్ తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పోస్టర్లను నేతలతో కలిసి డీఆర్వో మోహన్ కుమార్ శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం రాష్ట్ర సివిల్ సర్వీసెస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఒక్కటేనని జిల్లా అధ్యక్షుడు శివయ్య చెప్పారు. వచ్చే నెల ఐదో తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నేతలు నరేష్‌కుమార్, దేవకుమార్, హరిప్రసాద్, మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆవును, చింత చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు, గోమాత మృతి


ఆవు కళేబరం- చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు

పూతలపట్టు, మే 17 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన కారు తొలుత ఓ ఆవును, ఆపై పక్కనున్న చింతచెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోమాత మృతి చెందగా, వాహనంలోని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కడపజిల్లా వేంపల్లె సమీపాన ఉన్న తంగేడుపల్లెకి చెందిన బాబ్జీ రెడ్డి తన కుటుంబీకులతో కలసి కాణిపాకం వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరగా శనివారం మధ్యాహ్నం పూతలపట్టు మండలం పాటూరు సమీపాన వెళ్తుండగా కారు అదుపు తప్పి ముందు ఆవును ఢీకొంది. తర్వాత పక్కనున్న చింతచెట్టును ఢీకొనడంతో వాహనం ధ్వంసమైంది. ఆవు అక్కడికక్కడే మృతి చెందగా, వాహనంలోని బాబ్జీరెడ్డి, కొండమ్మ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు నిందితులకు రిమాండ్

చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల కారణంగా ఓ వ్యక్తిని కత్తులతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మిట్టూరుకు చెందిన రాకేష్ గంగజాతర సందర్భంగా మ్యాక్స్ షోరూమ్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రాను చూడటానికి వెళ్లాడు. మద్యం మత్తులో అక్కడే ఉన్న జానకారపల్లెకు చెందిన అన్నదమ్ములైన మహబూబ్ బాషా, గౌస్‌బాషాలు రాకేష్‌పై కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో రాకేష్ కడుపుపై తీవ్రగాయమైంది. మరుసటి రోజు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. శనివారం నిందితులను వారింటి వద్దే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విగ్రహాల చోరీ దొంగలను పట్టుకోండి: డీఎస్పీ

క్రైం కార్నర్

పాలసముద్రం, మే 17 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని వెంగళరాజుకుప్పం గంగమ్మ ఆలయంలో పంచలోహ విగ్రహాలను చోరీ చేసిన దొంగలను పట్టుకోవాలని నగరి డీఎస్పీ అజీజ్ ఆదేశించారు. శనివారం చోరీ జరిగిన ఆలయాన్ని పరిశీలించారు. పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని, సెల్‌ఫోన్ సిగ్నల్స్ తనిఖీ చేయాలన్నారు. పాలసముద్రం మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉండటం వల్ల తమిళనాడు పోలీసుల సాయం తీసుకోవాలని ఎస్‌ఐ చిన్నరెడ్డెప్పకు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

గాయపడ్డ వ్యక్తి మృతి


రవిసెల్వన్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తాపడిన ఘటనలో గాయపడిన డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14వ తేదీ రాత్రి మదనపల్లె నుంచి చెన్నై పోర్టుకు మ్యాంగో పౌడర్ లోడుతో వెళుతున్న కంటైనర్ చెన్నై-బెంగళూరు జాతీయరహదారిపై మొగిలి ఘాట్‌లోకి వచ్చాక అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈప్రమాదంలో తూత్తుకుడి జిల్లా కొవిల్‌పట్టు తాలూకా వడక్‌తెరువుకు చెందిన డ్రైవర్ రవిసెల్వన్‌కు తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడికి బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైకి తరలిస్తుండగా శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడిని కారు ఢీకొన్న ప్రమాదంపై కేసు నమోదు: బంగారుపాళ్యంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోడ్డు దాటుతున్న మేదరవీధికి చెందిన నారాయణ్‌లాల్(75)ను ఈనెల 8వ తేదీ రాత్రి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం ఆయన కుమారుడు ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



తవణంపల్లె, మే 17 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. తవణంపల్లె పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాణిపాకపట్నం సమీపంలోని బెంగళూరు-తిరుపతి హైవేలో ప్రైవేటు దాబా వద్ద ఓ యువకుడు (40) శుక్రవారం రాత్రి నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పానాటూరులో ట్రాక్టర్ చోరీ

గుడిపాల, మే 17 (ఆంధ్రజ్యోతి): పానాటూరులో ఓ ట్రాక్టర్ చోరీ గురైంది. ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. పానాటూరు గ్రామ సమీపంలో రాధాకృష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద తుమ్మలవారిపల్లెకి చెందిన బాలకృష్ణ నాయుడు అనే రైతు రాళ్ల కోసం ఫ్యాక్టరీ ముందు ట్రాక్టర్‌ను శుక్రవారం ఉంచాడు. అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు దాన్ని అపహరించుకెళ్లారు. ట్రాక్టర్ యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్‌ఐ మీడియాకు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి


నాగయ్య (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కేసీ కండ్రిగ గ్రామానికి చెందిన కేశవయ్య కుమారుడు నాగయ్య (57) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 14వ తేదీన విషపు ఆకు తిని అపస్మారకస్థితిలో పడిఉండగా కుటుంబీకులు గమనించి, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సుభాషిణి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

వాడవాడలా 'స్వచ్ఛాంధ్ర'


నగరి ఆర్టీవో కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంవీఐ వాసుదేవరెడ్డి

విజయపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం వాడవాడలా నిర్వహించారు. విజయపురంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేంద్ర చెత్త తొలగింపుపై అవగాహన కల్పించారు. కేశవపురంలో టీడీపీ నేత కొండూరు దామోదరం మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐరాల: తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ భవనాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎంపీడీవో ధనలక్ష్మి పాల్గొన్నారు.

పాలసముద్రం: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో కృష్ణమహేష్ రెడ్డి, ఈవోపీఆర్డీ రమేష్, ఏవో మధువాణి, కార్యాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: సింగిల్‌విండో సొసైటీ ఆవరణంలో అధికారులతో కలిసి డీసీవో నాగవర్ధన మొక్కలు నాటారు. ఎంపీడీవో ఆఫీస్‌లో ఎంపీడీవో సోమలరాజు సతీష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్, ఏపీవో శ్రీనివాసులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్, డీసీసీబీ బీఎం గోమతి, సింగిల్ విండో సీఈవో విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నగరి: ఆర్టీవో కార్యాలయ పరిసరాల్లో గుండ్రాజుకుప్పం ప్రజలతో కలిసి నగరి ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) వాసుదేవ రెడ్డి మొక్కలను నాటారు. అలాగే మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ కృష్ణారెడ్డి.. ఓంశక్తి ఆలయం వద్ద నుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పెనుమూరు: శాతంబాకం సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. సెక్రటరీలు శ్రీనివాసులు, మనోరంజని, లాంచన, సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: మండలంలోని అన్ని పంచాయతీల్లో ర్యాలీలు, మానవహారాలు జరిగాయి. ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశులు, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వైభవంగా అంకమ్మ తిరునాళ్ల



గుడిపాల, మే 17 (ఆంధ్రజ్యోతి): చెరుకూరికండ్రిగ గ్రామంలో అంకమ్మ తిరునాళ్ల శనివారంతో ముగిసింది. అమ్మవారిని అలంకరించి పుష్ప పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోండి

వెదురుకుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న 104 సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కార్వేటినగరం మండలం కత్తెరపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. శనివారం నీడీకండ్రిగ, టీకేఎంపేటలో 104 ద్వారా రోగులకు సేవలకు అందించారు.

వ్యాయామంతో ఆరోగ్యం భద్రం

పెనుమూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): రోజూ చిన్న చిన్న వ్యాయామాలు చేయడం, ఫిజియోథెరపీ చేసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు రమేష్‌రెడ్డి, సంతోష్ తెలిపారు. హైదరాబాదులో ఉన్న నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

చిత్తూరు రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని చెర్లోపల్లెలో శనివారం ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు క్యాంప్ హెడ్ శైలజ తెలిపారు. లేగదూడలకు డీవార్మింగ్ చేశారన్నారు. వెటర్నరీ వైద్యుడు చాణక్య, క్యాంప్ పీఆర్ ప్రశాంతి పాల్గొన్నారు.

పొన్నెమ్మ దేవతకు పూజలు



గంగాధరనెల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): బొమ్మవారిపల్లెలో వెలసిన పొన్నెమ్మ దేవతకు పూజలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకీలో అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. స్థానికులతోపాటు బెంగళూరు నుంచి కూడా భక్తులు విచ్చేశారు.

21, 22 తేదీల్లో గంగజాతర

పూతలపట్టు, మే 17 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో ఈనెల 21, 22 తేదీల్లో గంగజాతర నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకుడు జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 21న వంశపారంపర్య ధర్మకర్తల తొలిపూజతో జాతర ప్రారంభమౌతుందని, 22న నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పోలీసుల 'పల్లె నిద్ర'

యాదమరి, మే 17 (ఆంధ్రజ్యోతి): పాతపాళెంలో శుక్రవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఈశ్వర్ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వన్యప్రాణులను వేటాడినా.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతలపై అవగాహన కల్పించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



వెదురుకుప్పం, మే 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ కార్డులను శనివారం దిగువ పల్లాలు గ్రామంలో పంపిణీ చేశారు. జిల్లా వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.